# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 06 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఎప్‌సెట్‌కు 48,158 దరఖాస్తులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్)కు 48,158 మంది దరఖాస్తు చేశారు. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగానికి 31,805 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 16,317 మంది రెండింటికీ 36 మంది కలిపి మొత్తం 48,158 మంది దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా వచ్చేనెల నాలుగో తేదీ వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశముందని తెలిపారు. ఆలస్య రుసుంతో అదేనెల 24 వరకు దరఖాస్తులను సమర్పించొచ్చని సూచించారు. ఏప్రిల్ 29 నుంచి మే ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, మే రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఇతర వివరాల కోసం **https://eapcet.tgche.ac.in** వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

# ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై సుంకాలు.



- కొన్ని దేశాలు దశాబ్దాల పాటూ అమెరికాపై టారిఫ్‌లు విధిస్తున్నాయి
- భారత్ మాపై 100 శాతం కంటే ఎక్కువ సుంకాలను వసూలు చేస్తోంది
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

భారత్, చైనా సహా పలు దేశాలపై ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు అమలు చేయనున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి కాంగ్రెస్ సంయుక్త సెషన్‌లో ట్రంప్ ప్రసంగించారు. ఈ సందర్భంగా పదవి చేపట్టిన తర్వాత తాను చేసిన పనులు, సాధించిన విజయాల గురించి వివరించారు. ఇదే మీటింగ్‌లో భారత్, చైనా సహా పలు దేశాలపై విధించిన ప్రతీకార సుంకాలు వచ్చే నెల 2 నుంచి అమలు చేస్తామని వెల్లడించారు. కొన్ని దేశాలు దశాబ్దాల పాటూ అమెరికాపై టారిఫ్‌లు విధుస్తున్నట్లు ట్రంప్ ఈ సందర్భంగా తెలిపారు. యూరోపియన్ యూనియన్, చైనా, బ్రెజిల్, భారత్ వంటి చాలా దేశాలు తమ నుంచి అధిక సుంకాలు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ఇది చాలా అన్యాయమన్నారు. భారత్ తమపై 100 శాతం కంటే ఎక్కువ టారిఫ్‌లు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. 'భారత్ మాపై 100 శాతం కంటే ఎక్కువ సుంకాలను వసూలు చేస్తోంది. మా ఉత్పత్తులపై చైనా సగటు సుంకం మనం వసూలు చేసే దానికంటే రెండింతలు ఎక్కువ. ఇక దక్షిణ కొరియా సగటు సుంకం నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. ఇప్పుడు మనకు సమయం వచ్చింది. ఏప్రిల్ 2 నుంచి ఆయా దేశాలపై ప్రతీకార సుంకాలు ఉంటాయి. ఆయా దేశాలు మన ఉత్పత్తులపై ఎంత టారిఫ్‌లు విధిస్తే మనమూ తిరిగి అంతే వసూలు చేస్తాం' అని ట్రంప్ స్పష్టం చేశారు.

## రెండు ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

**సోన్ ప్రయాగ్-కేదార్ నాథ్, హేమకుండ్ సాహిబ్ రోప్ వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిన కేంద్ర క్యాబినెట్**



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

కేదార్ నాథ్ వేళ్లే భక్తులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. సోన్ ప్రయాగ్-కేదార్ నాథ్, హేమకుండ్ సాహిబ్ రోప్ వే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని మోడీ అధ్యక్షతన బుధవారం (మార్చి 5) జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఈ రెండు ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ మేరకు కేబినెట్ భేటీ వివరాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణమ్ మీడియాకు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం కేదార్‌నాథ్, హేమకుండ్ సాహిబ్ అనే రెండు రోప్‌వే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిందని ఆయన చెప్పారు. జాతీయ రోప్‌వేస్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ -పర్వతమాల పరియోజన కింద ఉత్తరాఖండ్‌లోని సోన్‌ప్రయాగ్ నుంచి కేదార్‌నాథ్ వరకు 12.9 కి.మీ పొడవైన రోప్‌వే ప్రాజెక్ట్ అభివృద్ధికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్రం రూ.4,081 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. సోన్ మార్గ్ కేదార్ నాథ్ రోప్ వే ప్రాజెక్ట్ పూర్తి అయితే.. కేదార్ నాథ్ చేరుకునేందుకు సమయం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం సోన్ మార్గ్ నుంచి కేదార్ నాథ్ వెళ్లడానికి 8 నుంచి 9 గంటల సమయం పడుతుండగా.. అదే ఈ రోప్ వే ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే కేవలం 36 నిమిషాల్లో కేదార్ నాథ్ చేరుకోవచ్చని తెలిపారు.

ఆస్ట్రియా, ఫ్రాన్స్ నిపుణుల సహాయంతో ఈ ప్రాజెక్ట్ కంప్లీట్ చేస్తామన్నారు. అలాగే.. హేమకుండ్ సాహిబ్ రోప్ వే ప్రాజెక్టు కూడా కేంద్రం ఆమోద ముద్ర వేసిందని చెప్పారు అశ్విని వైష్ణవ్. 12.4 కి.మీ. పొడవైన ఈ రోప్ వే ప్రాజెక్టు హేమకుండ్ సాహిబ్‌ను గోవింద్ ఘాట్‌తో కలుపుతుందని.. ఈ ప్రాజెక్టుకు రూ.2,730.13 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జాతీయ రోప్‌వేస్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ - పర్వతమాల పరియోజనలో భాగంగా ఈ ప్రాజెక్ట్ అభివృద్ధి చేపట్టామని అన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో అంజిరెడ్డి విజయం ఖరారైంది. అంజిరెడ్డికి 78,635 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి 73,644 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు 63,404 ఓట్లు పడ్డాయి.

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్య పోరు నువ్వా, నేనా? అన్నట్లు సాగింది. రెండ్రోజులుగా సాగుతున్న కౌంటింగ్ ఎంతో ఉత్కంఠను రేకెత్తించింది. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో ఫలితం తేలకపోవడంతో రెండో రౌండ్ ప్రాధాన్యత ఓట్లు లెక్కించారు. మంగళవారం రాత్రి 12 గంటల వరకూ ఆరు రౌండ్లు లెక్కించగా.. బీజేపీ అభ్యర్థి సి.అంజిరెడ్డి ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి కన్నా 6,931 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. వరసగా ఐదు రౌండ్లు ఆధిక్యం కనబరిచిన బీజేపీ.. 6, 7వ రౌండ్లలో మాత్రం వెనకబడింది. ఆరో రౌండ్‌లో నరేందర్‌రెడ్డి 211 ఓట్ల స్వల్ప ఆధిక్యం సాధించారు. ఏడో రౌండ్‌లో నరేందర్‌రెడ్డికి 600 పైచిలుకు ఓట్ల ఆధిక్యం లభించింది. అయితే బుధవారం సాగిన ఓట్ల లెక్కింపులో అదృష్టం బీజేపీ అభ్యర్థిని వరించింది

53 మంది ఎలిమినేషన్ తర్వాత కూడా ఫలితం తేలకపోవడంతో మొదటమూడవ స్థానంలో నిలిచిన ప్రసన్న హరికృష్ణ కు సంబంధించిన రెండో ప్రాధాన్యత ఓట్లతో ఫలితం వచ్చింది. పట్టబద్రులు 2,52,007 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, 27,671 ఓట్లు చెల్లకుండా పోయాయి. 2,24,336 ఓట్లు చెల్లడంతో అధికారులు 1,12,169 ఓట్లను కోటాగా ప్రకటించారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల తో పాటు 53 మంది ఎలిమినేషన్ అనంతరం బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి 78,635 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి 73,644, బిఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ 63,404 ఓట్లు సాధించారు.

56 మంది పోటీలో ఉండగా 53 మందికి కలిపి కేవలం 17,244 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. 53 మంది ఎలిమినేషన్ అనంతరం ప్రసన్న హరికృష్ణకు సంబంధించిన రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించే సమయంలో బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థులు తీవ్ర ఉత్కంఠకు గురయ్యారు. చివరకు ప్రసన్న హరికృష్ణకు సంబంధించిన రెండో ప్రాధాన్యత ఓట్లలో సైతం బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి 500 ఓట్లకు పైగా మెజార్టీ సాధించారు. దీంతో ఎన్నికల అధికారి కాసేపట్లో అధికారికంగా అంజిరెడ్డి గెలుపొందారని ప్రకటించనున్నారు.



## జూలై 3 నుంచి వార్షిక అమర్‌నాథ్ యాత్ర

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

దక్షిణ కాశ్మీర్‌లో 3880 మీటర్ల ఎత్తైన పవిత్ర గుహ క్షేత్రం అమర్‌నాథ్‌కు 38 రోజుల వార్షిక యాత్ర జూలై 3న మొదలవుతుందని అధికార ప్రతినిధి ఒకరు బుధవారం ప్రకటించారు. జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అధ్యక్షతన జరిగిన శ్రీ అమర్‌నాథ్ జీ ఆలయ మండలి 48వ బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. 'ఈ ఏడాది యాత్ర రెండు మార్గాలు అనంతనాగ్ జిల్లా పహల్‌గామ్ ట్రాక్, గందర్‌బల్ జిల్లా బల్తల్ నుంచి ఒకేసారి జూలై 3న ప్రారంభం అవుతుంది. అది ఆగస్టు 9న రక్షా బంధన్ రోజు పరిసమాప్తం అవుతుంది' అని అధికార ప్రతినిధి తెలియజేశారు. ఆలయ మండలి సభ్యులు సమావేశానికి హాజరయ్యారని, భక్తుల కోసం సౌకర్యాలు, సేవల మెరుగుదలకు ప్రతిపాదిత చర్యలు, కార్యక్రమాలను సమావేశంలో చర్చించారని ఆయన చెప్పారు. అవసరాన్ని బట్టి బల్తల్, పహల్‌గామ్, నున్వాన్, పంథా చౌక్ శ్రీనగర్‌లలో సౌకర్యాలను తగిన రీతిలో పెంచాలని కూడా చర్చించారని ఆయన తెలిపారు.

## భూములు అమ్మితే కానీ ప్రభుత్వాన్ని నడపలేరా..?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



భూములు అమ్మితే కానీ ప్రభుత్వాన్ని నడపలేని స్థితికి తెలంగాణను సీఎం రేవంత్ రెడ్డి తీసుకొచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రూ. 30 వేల కోట్ల నిధుల సమీకరణ కోసం తాజాగా హైదరాబాద్‌లోని విలువైన భూములను అడ్డికిపావుశేరు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బ్యాంకులో తనఖా పెట్టిన భూములనే వేలం వేసి అమ్ముకోవడం ప్రభుత్వ దివాలాకోరు తనానికి నిదర్శనం అన్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగపల్లి మండలం కంచ గచ్చిబౌలి పరిధిలో ఉన్న ఈ 400 ఎకరాల భూములను అమ్మడం లేదని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన రేవంత్, ఊసరవెల్లి కంటే వేగంగా మాట మార్చారని మేండిపడ్డారు. అసెంబ్లీని మోసం చేసిన రేవంత్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైడ్రా, మూసీ కూల్చివేతల వంటి తలాతోకలేని విధానాలతో రాష్ట్ర ఆదాయం తగ్గి ప్రభుత్వ భూములను అమ్ముకుంటే కాని ఆదాయం సమకూర్చుకోలేని స్థాయికి సర్కార్ దిగజారిందన్నారు.

తమ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులతో ఎన్నో సంక్షేమ పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రైతులు, పేదలను ఆదుకున్నామని కేటీఆర్ చెప్పారు. 70 లక్షల రైతులకు రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు, రూ.28 వేల కోట్ల రుణమాఫీ, రూ.6 వేల కోట్లతో రైతు బీమా, లక్ష 11 వేల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారాన్ని తమ ప్రభుత్వం అందించిందన్నారు. అలాగే, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ సాగర్ వంటి సాగునీటి ప్రాజెక్టులు, 45 వేల చెరువుల పునరుద్ధరణ, 45 లక్షల మందికి ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్, కళ్యాణ లక్ష్మి, వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు, 30 మెడికల్ కాలేజీలను ప్రారంభించామన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేస్తోందని గతంలో అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి అయిన మరుక్షణం నుంచి అప్పు చేయడాన్నే పరమావధిగా పెట్టుకున్నారని కేటీఆర్ విమర్శించారు. కేవలం 15 నెలల పాలనలోనే లక్షా 65 వేల కోట్ల పైచిలుకు అప్పు చేశారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ పైసలతో తెలంగాణ ప్రజలకు చేసిన ఒక్క మంచి పనినైనా చూపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలను ఎగ్గొట్టి, విద్యుత్ కోతలు విధించి, గురుకులాలను నిర్వీర్యం చేసి, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను పడావు వెట్టి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవగాహన రాహిత్యంతో శ్రీశైలం సొరంగాన్ని కుప్పకూల్చి 8 మంది ప్రాణాలు బలితీసుకున్న బాధ్యతలేని ప్రభుత్వం రేవంత్‌ది అని మండిపడ్డారు. లక్షల కోట్ల అప్పు చేసినా కూడా తట్టెడు మట్టి తీసింది లేదు. ఒక్క పథకం అమలు చేసింది లేదన్నారు. గల్లీలో గాలిమాటలు మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి, ఢిల్లీకి మాత్రం ధనం మూటలు మోయడాన్నే జీవిత లక్ష్యంగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన తెలంగాణ ప్రగతిని కేవలం 15 నెలల కాలంలోనే తిరోగమనం బాట పట్టించిన చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ అని కేటీఆర్ మండిపడ్డారు. నాడు అప్పులు తప్పని అడ్డగోలు అభాండాలు వేసి.. నేడు అందినకాడికి అప్పులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ దగాకోరు నైజాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు.

## మహిళా దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారి అధికారులను ఆదేశించారు. మహిళలు భారీ సంఖ్యలో హాజరవుతున్నందున, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. 8న పరేడ్ గ్రౌండ్‌లో జరుగనున్న మహిళా సదస్సు ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో సీఎం సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మహిళా శక్తి పాలసీని విడుదల చేస్తారని, మహిళా సమాఖ్యలకు అందజేయనున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాల నుంచి వచ్చే బస్సులకు బైసన్‌పోలో మైదానంలో పార్కింగ్ ఏర్పాటు చేయాలని, పార్కింగ్ ఏరియాల్లో లైటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. సభకు హాజరయ్యేవారికి సరిపడా తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలన్నారు. తగినన్ని మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని నిరంతరం పారిశుద్ధ్య ఏర్పట్లను పర్యవేక్షించాలని మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీకి రూ.200 జరిమానా




**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ కి లక్నో కోర్టు రూ.200 జరిమానా విధించింది. ఓ కేసు విచారణకు పదేపదే గైర్హాజరు అవుతుండటంతో పనిష్మెంట్ కింద కోర్టు ఈ జరిమానా వేసింది. జరిమానా డబ్బును ఫిర్యాదుదారు నరేంద్రపాండే తరఫు న్యాయవాదికి అందజేయాలని లక్నో అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు రాహుల్‌గాంధీ తరఫు న్యాయవాదికి సూచించింది.

స్వాతంత్ర్య సమరయోధుడు వీర సావర్కర్ పై అనుచిత వ్యాఖ్యల కేసులో విచారణకు రాహుల్ గైర్హాజర్ కావడంతో కోర్టు సీరియస్ అయింది. ఈ కేసు విచారణకు రాహుల్ గాంధీ బుధవారంనాడు హాజరు కావాల్సి ఉండగా, వ్యక్తిగత హాజరునించి ఆయనను మినహాయించాలని రాహుల్ తరఫు లాయర్ కోర్టును కోరారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ ముందస్తు షెడ్యూల్ ప్రకారం విదేశీ ప్రతినిధులతో సమావేశం కావాల్సి ఉందని, ఆ కారణంగా విచారణకు హాజరుకాలేరని కోర్టుకు విన్నవించారు. అయితే, కోర్టు ఆయన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. హాజరుకానుందుకు రూ.200 జరిమానా విధిస్తూ, ఏప్రిల్ 14న కచ్చితంగా తమ మందుహాజరు కావాలని ఆదేశించింది.

## ఎమ్మెల్సీ అభ్యర్థులపై చర్చ..!

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ భేటీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ భేటీ అయ్యారు. బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ తదితరులు ఆమెతోపాటు సీఎంను కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్సీ అభ్యర్థులపై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. ప్రస్తుతం మండలిలోని ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయ్యాయి. వాటిని భర్తీ చేసేందుకు ఇప్పటికే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఈ నెల 10న వరకు నామినేషన్‌లు దాఖలు చేసుకునేందుకు గడువు విధించింది. ఈ స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు టీపీసీసీ కోర్ కమిటీ కసరత్తు చేస్తున్నది. ఎమ్మెల్సీ పదవుల కోసం టీపీసీసీకి భారీ సంఖ్యలో దరఖాస్తులు అందినట్టు తెలిసింది. ఒక సీటు బీఆర్ఎస్‌కు వచ్చే అవకాశం ఉన్నది.

## ఇంటర్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతం

- తొలిరోజు 96.58 శాతం హాజరు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒక ప్రకటన విడుదల చేశారు. తొలిరోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షను నిర్వహిస్తామని తెలిపారు. 5,14,184 మంది దరఖాస్తు చేయగా, 4,96,899 (96.58 శాతం) మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 17,010 (3.42 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. హన్మకొండ, వరంగల్‌లో రెండు మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశామని తెలిపారు. ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు సిద్దిపేట, పెద్దపల్లి, మహబూబాబాద్, వనపర్తి, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పర్యటించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారని పేర్కొన్నారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయనీ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోని నారాయణగూడలో పరీక్షా కేంద్రాలను ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సందర్శించి తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. తనిఖీలో భాగంగా హైదరాబాద్‌లోని నారాయణగూడలో ఉన్న రత్న జూనియర్ కాలేజీ, జాహ్నవి జూనియర్ కాలేజీ, శ్రీచైతన్య జూనియర్ కాలేజీని ఆయన సందర్శించారు. భద్రతా ఏర్పాట్లు, విద్యార్థుల సీట్ల కేటాయింపు, పరీక్ష ప్రోటోకాల్ సమ్మతిని సమీక్షించారు. విద్యార్థులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తూ పరీక్షలను నిష్పాక్షికంగా, సజావుగా నిర్వహించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. అధికారులు, కళాశాల యాజమాన్యం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలనీ, ఏదైనా అక్రమాలను నివారించడానికి అవసరమైన అన్ని చర్యలనూ తీసుకోవాలని కోరారు. పరీక్షా ప్రక్రియ సమగ్రత, పారదర్శకత నిర్వహించడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పరీక్షలు సజావుగా ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు. గురువారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 25 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి.

## సమయపాలన పాటించాల్సిందే

- డ్యూటీలకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవు
- డాక్టర్లు బాధ్యతగా వ్యవహరిస్తేనే, సిబ్బంది బాధ్యతగా ఉంటారు
- ఉన్నతాధికారులతో సమీక్షలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- హాస్పిటల్స్‌లో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని వెల్లడి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

డాక్టర్లు, వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాల్సిందేనని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. ఆశ వర్కర్ల నుంచి మొదలు పెడితే, టీచింగ్ హాస్పిటల్స్‌లో ప్రిన్సిపల్స్ వరకూఎవరి డ్యూటీ వారు సక్రమంగా చేయాల్సిందేనన్నారు. డ్యూటీలకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ మేరకు బుధవారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో డాక్టర్లు, వైద్య సిబ్బంది సమయపాలన, హాస్పిటల్స్‌లో ఎక్విప్‌మెంట్ నిర్వాహణ, అవయవదానం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. జూబ్లిహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీస్‌లో జరిగిన ఈ సమీక్షలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, జీవన్‌దాన్ ట్రస్ట్ ఇంచార్జ్, డాక్టర్ భూషణ్ రాజు, గాంధీ హాస్పిటల్ ప్రిన్సిపల్ ఇందిరా, సూపరింటెండెంట్ రాజకుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖాన్లపై నమ్మకాన్ని పెంచేలా డాక్టర్లు, సిబ్బంది పనిచేయాలన్నారు. గాంధీ హాస్పిటల్‌లో ముందస్తు సమాచారం లేకుండా డాక్టర్లు డ్యూటీలకు గైర్హాజరు అవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలని, వారిని చూసి వైద్య సిబ్బంది కూడా బాధ్యతగా ఉంటారన్నారు. అన్ని మెడికల్ కాలేజీలు, హాస్పిటళ్లలో అటెండెన్స్ మానిటరింగ్‌పై మరింత శ్రద్ధ పెట్టాలని డీఎంఈ నరేంద్ర కుమార్‌ను మంత్రి ఆదేశించారు. అటెండెన్స్ మానిటరింగ్ కోసం ప్రతి కాలేజీలో ఓ సీనియర్ ప్రొఫెసర్‌ను నోడల్ ఆఫీసర్‌గా నియమించాలని సూచించారు. హాస్పిటళ్లలో ఆకస్మిక తనిఖీలు

మిగిలా 2వ పేజీలో

## తెలంగాణ కాంగ్రెస్‌లో మూడు గ్రూపులుగా విభజన



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలోమీనాక్షి నటరాజన్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా వచ్చినప్పటి నుండి హస్తం పార్టీ రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. తాజాగా మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ నేతలను మూడు గ్రూపులుగా విభజించి సంచలన నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్నవారు ఒక గ్రూప్. ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని రెండో గ్రూపుగా, అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో చేరిన వారిని మూడో గ్రూపుగా విభజించారని సమాచారం. పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల భర్తీలో ఈ కేటగిరీల వారీగా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

# రేవంత్ రెడ్డి బీజేపీకి సపోర్ట్ చేస్తున్నారు

- రేవంత్ కావాలనే నన్ను సస్పెండ్ చేయించారు
- తీన్మార్ మల్లన్న సంచలన వ్యాఖ్యలు



**బలగం టీవి, హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. బీజేపీకి పరోక్షంగా మద్దతు ఇస్తూ.. కాంగ్రెస్ పార్టీని ఖతం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని.. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. అందుకే పలు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి.. బీజేపీ గెలిచేలా చేశారని అన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడున్నారనే కారణంతో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ కొద్ది రోజుల క్రితం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై మల్లన్న బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. 'కులగణన సర్వే పత్రాలను తగలబెడితే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా?' అని ఆయన ప్రశ్నించారు. రాహుల్ గాంధీ తల ఎత్తుకునేలా సర్వే జరగాలని ముఖ్యమంత్రికి సూచించిన విషయాన్ని ఆయన వెల్లడించారు. అందుకే రేవంత్ రెడ్డి తనను సస్పెండ్ చేయాలని చాలాకాలంగా అనుకుంటున్నారని అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసిలకు గట్టి మద్ధతు లభించిందని.. భవిష్యత్తులో మరింత బలంగా పోరాడుతామన్నారు. తనను సస్పెండ్ చేస్తే బిసిలు ప్రశ్నించరనే భ్రమ నుంచి రేవంత్ బయటకు రావాలని అన్నారు. అంతేకాక.. సమగ్ర కుటుంబ సర్వేను కేసీఆర్ పకడ్బందీగా నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కులగణన సర్వేలో అగ్రవర్ణాలను ఎక్కువగా.. బిసిలను తక్కువ చూపించారని ఆరోపించారు. కులగణన సర్వే చేస్తానని హామీ ఇచ్చారు కాబట్టే తాను కాంగ్రెస్ చేరానని తెలిపారు. కెసిఆర్‌పై తాను పోరాటం చేసినప్పుడు కాంగ్రెస్ నేతలంతా ఎక్కడ ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ఇక రేవంత్ రెడ్డి సీఎం కుర్చీలో కూర్చోవడానికి పునాది వేసింది తానేనని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందని.. అందుకు కారణం సీఎం రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. సీఎం సొంత జిల్లాలోని మహబూబ్‌నగర్, ఆయన సిట్టింగ్ సీటు అయిన మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లో కావాలనే కాంగ్రెస్ పార్టీని ఆయన ఓడించారని పేర్కొన్నారు. ఇక ప్రస్తుతం వెలువడుతున్న టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఓటమికి రేవంత్ రెడ్డే కారణమని ఆరోపించారు. ఈ ఒకవేళ లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో రేవంత్ రెడ్డి బలంగా ప్రచారం చేసి ఉంటే.. కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రాకపోయేదని తెలిపారు. 2028లో బిసినే తెలంగాణ ముఖ్యమంత్రి అవుతాడని ఆయన అన్నారు.

# కేసీఆర్ మీద కోపంతో రైతులకు అన్యాయం చేయొద్దు

- మేడిగడ్డలో కుంగిన పిల్లర్లను బాగు చేసే తీరిక ప్రభుత్వానికి లేదు
- రంగనాయక సాగర్‌లోకి కాళేశ్వరం పంప్ హౌసుల ద్వారా నీటిని విడుదల చేసినందుకు ధన్యవాదాలు
- కాళేశ్వరం తెలంగాణకి వరప్రదాయిని
- ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కండ్లు తెరవాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



**బలగం టీవి, హైదరాబాద్**

కేసీఆర్ మీద కోపంతో రైతులకు అన్యాయం చేయొద్దు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గం, చిన్నకోడూరు మండలం, చంద్లపూర్‌లోని రంగనాయక సాగర్ ప్రాజెక్టును సందర్శించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. "రంగనాయక సాగర్‌లోకి కాళేశ్వరం పంప్ హౌసుల ద్వారా నీటిని విడుదల చేసినందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి ధన్యవాదాలు. సిద్దిపేట నియోజకవర్గంలో 50 వేల ఎకరాల్లో పంట సాగు అవుతుంది. పంట చేతికొచ్చే సమయానికి నీళ్ల లేకపోతే రైతులు ఇబ్బంది పడతారని విజ్ఞప్తి చేయగా, అనంతసాగర్ నుండి 1 టిఎంసి నీళ్లను రంగనాయక సాగర్‌కు పంపినందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి ధన్యవాదాలు. గత ప్రభుత్వం చేసిన మంచి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం తుడిచిపెట్టాలని చూస్తుంది.. ప్రజలకు నష్టం చేయకూడదు.

ఎస్సారెస్పీ స్టేజ్ 2లో తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట, భూపాలపల్లి ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఎస్సారెస్పీ నీరు తగ్గినప్పటికీ, కాళేశ్వరం ద్వారా రెండు పంటలకు సాగునీరు విడుదల చేశాం. కాళేశ్వరంలో 15 రిజర్వాయర్లు బాగున్నాయి, 23 కిలోమీటర్ల టన్నెల్లు బాగున్నాయి, 19 సబ్ స్టేషన్లు బాగున్నాయి, 21 హౌసులు బాగున్నాయి, ప్రెజర్ మైన్లు బాగున్నాయి. మేడిగడ్డలో ఏడు బ్లాకులు ఉంటే, అందులో ఒక్క బ్లాక్‌లో ఒక్క పిల్లర్ మాత్రమే కుంగిపోయింది. కానీ గోరంతను కొండంత చేసి బీఆర్ఎస్‌పై బురదజల్లే ప్రయత్నం చేశారు. అధికారంలోకి వచ్చారు..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు అయింది. ఈ 15 నెలల్లో మేడిగడ్డలో కుంగిన పిల్లర్లను బాగు చేసే తీరిక ప్రభుత్వానికి లేదు. నేడు గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయి.. ఆ నీళ్లను లిఫ్ట్ చేసి లక్షల ఎకరాల పంటను కాపాడే అవకాశం ఉంది. కేసీఆర్ మీద కోపంతోనే, బీఆర్ఎస్ మీద కోపంతోనే, తెలంగాణ రైతులకు అన్యాయం చేయకూడదని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఈ ప్రాంతంలో 500–1000 ఫీట్ల బోర్లు వేసినా నీళ్ల వచ్చే పరిస్థితి ఉండేది కాదు. ఈ రోజు రంగనాయక సాగర్ కింద, అనంతసాగర్ కింద, మల్లన్న సాగర్ కింద పండే పంట కాలేశ్వరం పంట కాదా? పెండింగులో ఉన్న పంట కాలువల పనులు పూర్తి చేయాలి. కాళేశ్వరం కుంగింది అన్నవారికి, ఈ నీళ్ల ఎక్కడి నుంచి వచ్చాయి? రైతులతో పాటు మత్స్య సంపద కూడా పెరిగి, మత్స్యకారులకు ఆదాయం వస్తుంది. అన్ని వర్గాలకు మంచిచేసే ఇలాంటి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయకూడదు. కాళేశ్వరం తెలంగాణకి వరప్రదాయిని. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కండ్లు తెరవండి.. లేదంటే చరిత్ర మిమ్ములను క్షమించదు.

## 6న ఖమ్మంలో జాబ్ మేళా..

**బలగం టీవి, హైదరాబాద్**

ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 6న గురువారం ఉదయం 10.00 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ లోని వై.ఎస్.కె. ఇన్ఫో టెక్ ప్రైవేటు లిమిటెడ్ లో అసెంబ్లింగ్ ఆపరేటర్, టెక్నికల్ టీమ్ సపోర్ట్, క్వాలిటీ చెకర్స్ ఖాళీల కోసం ఎస్.ఎస్.సి. ఐ.టి.ఐ. ఏదేని డిగ్రీ పాస్, ఫెయిల్ అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపికైన వారికి వేతనం 16 వేలు ఉంటుందన్నారు. అలాగే హైదరాబాద్ లోని జిజె సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ ఖాళీల కోసం ఏదేని డిగ్రీ అర్హత కలవారు దరఖాస్తు చేసుకోవాలని, వేతనం రూ.13 వేలు ఉంటుందన్నారు. మొత్తం 500 ఉద్యోగ ఖాళీల భర్తీకి గానూ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు 18 నుండి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు అర్హులని, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కులగణనపై అభ్యంతరాలుంటే శాసనమండలిలో మాట్లాడవచ్చు

- తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై మంత్రి సీతక్క కౌంటర్

**బలగం టీవి, హైదరాబాద్**



కులగణనపై అభ్యంతరాలు ఉండి ఉంటే శాసనమండలిలో మాట్లాడవచ్చని మంత్రి సీతక్క అన్నారు. తీన్మార్ మల్లన్న మీడియా సమావేశం నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఆయన వ్యాఖ్యలకు సీతక్క కౌంటర్ ఇచ్చారు.కొంతమంది బీజేపీ, బీఆర్ఎస్ గొంతుకలై మాట్లాడుతున్నారంటూ మంత్రి సీతక్క విమర్శలు గుప్పించారు. కులగణనపై అభ్యంతరాలు ఉండి ఉంటే శాసనమండలిలో మాట్లాడవచ్చని సూచించారు. బీఆర్ఎస్ చేయలేనిది తమ ప్రభుత్వం చేసినందుకు అభినందించాల్సింది పోయి విమర్శించడం సరికాదని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శ్రమతో అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్యానించారు. కులగణనకు 50 రోజుల సమయం ఇచ్చామని తెలిపారు.

## మంత్రి కొండా సురేఖను అభినందించిన సోనియాగాంధీ

**బలగం టీవి, హైదరాబాద్**

దక్షిణ కాశీగా గుర్తింపు పొందిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఆలయంలో 42 ఏళ్ల తర్వాత ప్రత్యేక చొరవ తీసుకొని మహా కుంభాభిషేకం నిర్వహించడంపై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ప్రశంసించారు. కాళేశ్వర, ముక్తీశ్వరస్వామి మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. కొండా సురేఖకు సోనియాగాంధీ లేఖ రాశారు. త్రివేణి సంగమం జలాలకు ఎంతో ప్రత్యేకత ఉందని, తనకు ప్రసాదాన్ని, త్రివేణి సంగమం పవిత్ర జలాలను పంపించిందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కాళేశ్వర, ముక్తీశ్వరస్వామి స్థల విశిష్టతను, ప్రశస్థను తెలియజేసినందుకు సురేఖను అభినందించారు. కాగా, 1982లో మొదటిసారి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ జరిగిన సమయంలో ఇక్కడ మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత మళ్లీ 42 ఏళ్ల తర్వాత గత నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మహాకుంభాభిషేక వేడుకలను నిర్వహించారు.

## అమెరికాలో కాల్పుల్లో తెలంగాణ విద్యార్థి మృతి

**బలగం టీవి, హైదరాబాద్**

అమెరికాలో దుండగులు జరిపిన కాల్పుల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థిమృతి చెందాడు. రంగారెడ్డి జిల్లా కేశంపేటకు చెందిన గంప ప్రవీణ్(27) ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లాడు. అక్కడ మిల్వాకీ కౌంటీలో ఉంటూ ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అయితే దుండగులు ప్రవీణ్‌పై కాల్పులు జరపగా.. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రవీణ్ మరణవార్త తెలియగానే అతని కుటుంబసభ్యులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. అతని మృతితో కేశంపేట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# సమయపాలన పాటించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతాయన్నారు.

2022, 2023, 2024లో మూడు దశల్లో ఏర్పాటైన 25 మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ టీచింగ్ హాస్పిటళ్ల నిర్మాణ పనుల పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. వర్షాకాలంలోగా వీలైనంత వేగంగా ముఖ్యమైన పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటళ్లలో డయాగ్నస్టిక్ ఎక్విప్‌మెంట్ పనితీరుపై సమావేశంలో చర్చించారు. నిపుణులైన బయోమెడికల్ ఇంజనీర్ల కొరత ఉన్నదని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. బయోమెడికల్ ఇంజనీర్లు, టెక్నీషియన్ల నియమాకానికి చర్యలు తీసుకోవాలని, వారికి ట్రైనింగ్ ఇప్పించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. ట్రైనింగ్ బాధ్యతలను నిమ్స్‌లో ఉన్న బయోమెడికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించాలని ఆదేశించారు.

జీవన్‌దాన్ పనితీరుపై మంత్రి సమీక్షించారు. ప్రభుత్వ దవాఖాన్లలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ల సంఖ్య పెంచాలని, ఆరోగ్యశ్రీ కింద వీలైనంత ఎక్కువ మంది పేషెంట్లకు అవయవ మార్పిడి చికిత్స చేయాలని మంత్రి సూచించారు.

గాంధీలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ పనులను త్వరగా పూర్తిచేయాలని, మెడికల్ కార్పొరేషన్ ఎండీ హేమంత్‌ను మంత్రి ఆదేశించారు.

## దక్షిణ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత అధికం

**బలగం టీవి, హైదరాబాద్**

దక్షిణ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉందని, ఆ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశామని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు వెల్లడించారు. మార్చి ప్రారంభంలోనే తెలంగాణలో ఉష్ణోగ్రతలు సుమారు 40 డిగ్రీలకు చేరుకున్నట్లు తెలిపారు. మార్చి నెలాఖరు నాటికి ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో పాటు వడగాలులు వీస్తాయని వెల్లడించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఖమ్మంలో 39.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలిపారు. ప్రస్తుతం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38 నుండి 39 డిగ్రీల మధ్య నమోదవుతోందన్నారు. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. మంగళ, బుధవారాల్లో ఉష్ణోగ్రతలు అతి స్వల్పంగా తగ్గినప్పటికీ ముందు పెరుగుతాయన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే ఒకటి రెండు డిగ్రీలు అధికంగా ఉన్నాయని చెప్పారు. మార్చి చివరి రెండు వారాల్లో ఉష్ణోగ్రత అధికంగా ఉండవచ్చని వెల్లడించారు.

## నేడు ఐసెట్ నోటిఫికేషన్ విడుదల..

**10 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ**

**బలగం టీవి, హైదరాబాద్**

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఐసెట్ నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. అభ్యర్థులు మార్చి 10 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చు. ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు రూ. 550, బీసీలు, జనరల్ విద్యార్థులు రూ. 750 ఫీజుగా చెల్లించాలి. ఆలస్య రుసుము లేకుండా మే 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 8, 9 తేదీల్లో ఐసెట్ పరీక్షలను నిర్వహిస్తామని ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఏ రవి తెలిపారు.

# పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..



**బలగం టీవీ , సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సహస్ర జూనియర్ కళాశాల, సాయి శ్రీ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా కలెక్టర్ పరిశీలించారు.

**మొదటి రోజు 132 మంది విద్యార్థులు గైర్హాజరు..**

జిల్లావ్యాప్తంగా ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు బుధవారం ప్రారంభం కాగా,జనరల్ 3,551, అలాగే ఒకేషనల్ విద్యార్థులు 513 మంది మొత్తం కలిపి 4,064 మంది హాజరు కావాల్సి ఉండగా, జనరల్ 3,470, అలాగే ఒకేషనల్ విద్యార్థులు 462 మంది హాజరయ్యారు. జనరల్ 81, అలాగే ఒకేషనల్ విద్యార్థులు 51 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు.

## మహిళలు అభద్రత భావానికి గురైనప్పుడు భయపడవద్దు..

**-వేధింపులకు గురైతే వెంటనే షీ టీం 87126 56425 పిర్యాదు చేయండి**
**- ఎస్పీ అఖిల్ మహాజన్**



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మహిళల ,విద్యార్థుల రక్షణయే లక్ష్యంగా ఏర్పాటు చేసిన షీ టీం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి మహిళ చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ , పోక్సో, ర్యాగింగ్, మొదలగు అంశాలపై అవగాహన కల్పిస్తూ మహిళ, విద్యార్థినీల భద్రతకు భరోసా కల్పించడం జరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ

విద్యార్థినులు,మహిళలు అభద్రత బావనికి గురైనప్పుడు భయపడొద్దని,ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీం కి లేదా పోలీస్ అక్కడ ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.జిల్లాలో మహిళ, విద్యార్థిని రక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోందని ప్రధానంగా మహిళలు, విద్యార్థినిలుఅపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు.మీ వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని,ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో పరిచమయ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తం వుండాలని అన్నారు .మహిళలు తాము పనిచేసే ప్రదేశాల్లోగాని,మరేక్కడైన లైంగిక వేధింపులకు గురౌవుతున్న,ర్యాగింగ్ లాంటి వేధింపులకు గురౌవుతున్న మహిళలు, విద్యార్థునులు,బాలికలు మౌనంగా ఉండకుండా, ధైర్యంగా పిర్యాదు చేయాలనిఅన్నారు .ఎవరైనా ఆకతయులు మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు .

విద్యాసంస్థల్లోఎవరైనా వేధించినా, రోడ్డుపై వెళ్లేటప్పుడు,పని చేసే ప్రదేశాల్లో అవహేళనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100, జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగుతుంది అని అన్నారు.

జిల్లాలో విద్యాసంస్థల వద్ద షీ టీం ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించి బైక్ లపై ట్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ విద్యార్థినులకు ఇబ్బందులు గురి చేస్తున్నా వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# బీడీ కార్మికులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి..

**-బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ముశం రమేష్**




**బలగం టీవీ , సిరిసిల్ల**

కాంగ్రెస్ ప్రభుత్వం బీడీ కార్మికులకు ఇచ్చిన హామీ నాలుగు వేల ఆసరా పెన్షన్ వెంటనే అమలు చేయాలని బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ముశం రమేష్ డిమాండ్ చేశారు.బుధవారం అమృత్ లాల్ శుక్లా కార్మిక భవనంలో బీడీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) సమావేశం సూరం పద్మ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ము శం రమేష్ హాజరై, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా బీడీ కార్మికులందరికీ 4వేల పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా కూడా ఇప్పటికీ హామీ అమలు చేయకుండా పోయిందని, వెంటనే నాలుగు వేల పెన్షన్ బీడీ కార్మికులకు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీడీ కార్మికులకు బీడీ కంపెనీలు చేతినిండా పని కల్పిస్తలేరని,పని చేసిన దానికి సరియైన వేతనం ఇవ్వలేకపోవడం,బీడీ కంపెనీల దోపిడి విపరీతంగా పెరిగిపోవడం వలన కార్మికులు తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.ఈ పరిస్థితుల్లో ఆసరా పెన్షన్ 4000 వస్తే కొంత కుటుంబానికి ఆసరా దొరికే పరిస్థితి కలుగుతుందని అన్నారు.ప్రభుత్వం బీడీ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, బీడీ యజమాన్యం చేస్తున్న దోపిడీల పట్ల ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో లక్షలాదిమంది బీడీ పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తున్న వారి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి మానుకొని వెంటనే ప్రభుత్వంఇచ్చిన హామీని అమలు చేయాలని,బీడీ కార్మికులకు బీడీలకు 500 వేతనం వచ్చే విధంగా కనీస వేతనం చట్టంఅమలు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా నాయకులు బీడీవర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు దాసరి రూప, బెజిగం సురేష్, జిందం కమలాకర్, బీడీ నాయకులు రైసా బేగం, సబ్బని శాంతమ్మ, కొక్కుల యశోద,బోడ శోభ, పద్మ,కస్తూరి విజయ, సుజాత,సౌర్య తదితరులు పాల్గొన్నారు.



## చంద్రంపేట పాఠశాలలో
# ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు..

**బలగం టీవీ , సిరిసిల్ల**

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిరిసిల్ల అర్బన్ చంద్రంపేట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థిని విద్యార్థులు చేసిన సైన్స్ ఎగ్జిబిట్స్ అందరిని ఆలోచింపచేసాయి. సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్,అంజలి లు విద్యార్థులను ఉత్తేజితం చేసి వారిచే అద్భుతమైన ప్రయోగాలు చేయించారు. విద్యార్థులు తయారు చేసిన ఈ ఎగ్జిబిట్స్ ద్వారా శాస్త్రీయ దృక్పథాన్ని ,శాస్త్రీయ వైఖరి పెంపొందడానికి తోడ్పడతాయని, మూఢనమ్మకాలను పారద్రోలడానికి సైన్స్ ఏకైక అస్త్రంగా పనిచేస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనమాల శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఉత్తమ ఎక్సిబిట్స్ ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులను అందించారు.అనంతరం సైన్స్ ఉపాధ్యాయులను పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం సామల దేవామనికైరి పద్మ , కొండికొప్పుల రవి,గువలకొండ శ్రీనివాస్ , వేముల అంజలి,ముంజ రమ, వొద్యారం మధుసూదన్, త్రివేణి,లత మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆది శ్రీనివాస్ పైన తప్పుడు కూతలు కూస్తే సహించేది లేదు..

**-పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు లహరి**

**-బీఆర్ఎస్ నాయకురాలు పావని గౌడ్ పై ఫిర్యాదు చేసిన మహిళా కాంగ్రెస్ నాయకులు.**



**బలగం టీవీ , వేములవాడ**

బీఆర్ఎస్ పార్టీకి నాయకురాలు పావని గౌడ్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రజా పాలన ప్రభుత్వం మీద తప్పుడు ప్రచారాలు చేస్తూ, అసత్య పోస్టులు పెడుతూ ప్రజలను అయోమయాన్ని గురి చేస్తున్నారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో మహిళా కాంగ్రెస్ నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా పట్టణ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట లహరి మాట్లాడుతూ మా నాయకుడు ఆది శ్రీనివాస్ పై తప్పుడు కూతలు కూస్తే నాలుక కోస్తామని అన్నారు.. నోరు ఉన్నదని ఇష్టమున్నట్టు మాట్లాడితే సహించబోమని, పావని గౌడ్ నువ్వు చూపించిన కెనాల్ వేములవాడ నియోజకవర్గం సంబంధించిందా,ఎక్కడిదో కెనాల్ చూపించి మా నాయకుడి పైన బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.మా నాయకుడు నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న ఏకైక నాయకుడు ఆది శ్రీనివాస్ అని వారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూరల శ్రీశైలం, తోట రాజేష్, మిట్ట సంతోష్, మాజీ కౌన్సిలర్ లక్ష్మి నాగభూషణం, మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గడ్డం రేణుక, వేములవాడ పట్టణ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చింతకింది లత, పందిళ్ల రేణుక, తదితరులు పాల్గొన్నారు.

# జల్సాలకు అలవాటు పడ్డ వ్యక్తి అరెస్టు..
## రిమాండ్ తరలింపు




**బలగం టీవీ, ముస్తాబాద్**

ముస్తాబాద్ మండలంలోని పలు ఆలయాల్లో దొంగతనాలు చేస్తూ వాటిని అమ్ముకొని జల్సాలకు అలవాటు పడ్డ వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తెర్లమద్ది గ్రామానికి చెందిన మామిండ్ల ఆంజనేయులుఏ అంజి ఇటీవల మొర్రాయిపల్లి, గూడూరు గ్రామాలలో ఉన్న ఆలయ తాళాలు పగలగొట్టి నగదు తోపాటు పలు వస్తువులను దొంగతనం చేసి అమ్ముకొని జలసాలకు అలవాటు పడ్డాడు. బుధవారం మండల శివారులోని ఓ గార్డెన్ వద్ద అదుపులోకి తీసుకొని విచారించ చగా నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించారు.

## భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**బలగం టీవీ , హైదరాబాద్**

దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 740 పాయింట్లు లాభపడి 73,730కి పెరిగింది. నిఫ్టీ 254 పాయింట్లు పుంజుకుని 22,337 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 86.96గా ఉంది.

# వన్డేలకు స్టీవ్ స్మిత్ రిటైర్మెంట్

**బలగం టీవి, హైదరాబాద్**




ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. తాజాగా జరుగుతున్న చాంపియన్స్ ట్రోఫీలో.. ఆస్ట్రేలియా జట్టు సారధిగా బాధ్యతలు నిర్వర్తించాడు స్మిత్ . ప్యాట్ కమ్మిన్స్ గైర్హాజరీలో చాంపియన్స్ ట్రోఫీ కోసం స్టీవ్ స్మిత్ కెప్టెన్సీ పగ్గాలు చేపట్టాడు. అయితే మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓటమి పాలైంది. దీంతో 35 ఏండ్ల స్మిత్.. వన్డేల నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పాడు. స్టీవ్ స్మిత్ తన కెరీర్‌లో 170 వన్డేలు ఆడాడు. వాటిల్లో 5800 రన్స్ చేశాడు. దీంట్లో 12 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

తన వన్డే జర్నీ అద్భుతంగా సాగిందని, ప్రతి క్షణాన్ని ప్రేమించినట్లు స్మిత్ తెలిపాడు. తన క్రికెట్ కెరీర్‌లో ఎన్నో అద్భుత క్షణాలు ఉన్నాయని, మధుర స్మృతులు, జ్ఞాపకాలు ఉన్నాయని, రెండు ప్రపంచ కప్‌లు గెలవడం సంతోషంగా ఉందని, తనతో ఎంతో మంది జట్టు సభ్యుల్ని కెరీర్‌ను పంచుకున్నట్లు స్మిత్ తన ప్రకటనలో తెలిపాడు. 2027 వరల్డ్‌కప్ కోసం ఆస్ట్రేలియా జట్టు సమాయత్తం కావాల్సిన తరుణం ఆసన్నమైందని స్మిత్ పేర్కొన్నాడు. టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇస్తున్నానని, వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో ఆడేందుకు ఆసక్తిగా ఉన్నానని, వెస్టిండీస్, ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లోనూ పాల్గొనున్నట్లు చెప్పాడు.

# నెంబర్ 4 కు విరాట్ కోహ్లీ

**బలగం టీవి, హైదరాబాద్**




టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం మెరుగుపరచుకుని నాలుగో స్థానంలోకి వచ్చారు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన సెమీస్ పోరులో రాణించిన సంగతి తెలిసిందే. 98 బంతుల్లో 84 పరుగులు చేసిన అతడు.. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో 747 రేటింగ్ పాయింట్లతో నిలిచాడు. ఇదే సమయంలో కెప్టెన్ రోహిత్ శర్మ మూడో స్థానం నుంచి రెండు ర్యాంకులు కిందకి పడిపోయాడు. ప్రస్తుతం 745 రేటింగ్ పాయింట్లతో కొనసాగుతున్నాడు. టీమిండియా స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానంలోనే కొనసాగుతుండగా.. పాకిస్థాన్ క్రికెటర్ బాబర్ అజామ్, హెన్రిచ్ క్లాసెన్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. శ్రేయస్ అయ్యర్ ఒక్క స్థానం ఎగబాకి 8వ ర్యాంకులో నిలిచాడు. కేఎల్ రాహుల్ 15వ స్థానంలోనే కొనసాగుతున్నాడు.

బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో శ్రీలంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 2,3 ర్యాంకుల్లోకి సౌతాఫ్రికా కేశవ మహారాజ్, న్యూజిలాండ్ మ్యాథ్యూ హెన్రీ వచ్చారు. రషీద్ ఖాన్, కుల్దీప్ యాజవ్ రెండు, మూడు నుంచి చెరో మూడు స్థానాలు కిందకి పడిపోయి ఐదు, ఆరు స్థానాల్లో నిలిచారు. మహ్మద్ షమీ 3 ర్యాంకులు ముందుకు జరిగి 11వ స్థానంలో నిలవగా.. 13వ స్థానంలో జడేజా ఉన్నాడు. సిరాజ్ రెండు స్థానాలు కిందకి పడిపోయి 14వ ర్యాంకులో నిలిచాడు.

ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అఫ్గనిస్థాన్ ఆటగాడు అజ్మతుల్లా ఒమర్జాయి అగ్రస్థానంలో, మహ్మద్ నబీ రెండో స్థానంలో నిలిచారు. రవీంద్ర జడేజా 9వ ర్యాంకులో కొనసాగుతున్నాడు. అక్షర్ పటేల్ ఏకంగా 17 స్థానాలు ఎగబాకి 13వ ర్యాంకుకు చేరుకోగా, హార్దిక్ పాండ్య మూడు స్థానాలు ఎగబాకి 21వ ర్యాంకులో నిలిచాడు.




# అత్తాపూర్‌లో నిధి అగర్వాల్ సందడి

**బలగం టీవి, హైదరాబాద్**

సినీ నటి నిధి అగర్వాల్ అత్తాపూర్‌లో సందడి చేసింది. స్థానికంగా కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్ఎస్ బ్రదర్స్ 13వ షోరూమ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి. వెంకటేశ్వర్లు, ఎస్. రాజమౌళి, టీ. ప్రసాదరావు సహా షోరూమ్ నిర్వాహకులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ బ్రదర్స్ నిర్వహాకులు మాట్లాడుతూ.. వినియోగదారులకు ఉన్నత స్థాయి సేవలను అందించడంలో ఆర్ఎస్ బ్రదర్స్ ఎల్లప్పుడూ అగ్రగామిగా ఉంటుందని తెలిపారు. అత్తాపూర్‌లో 13వ షోరూమ్‌ను స్థాపించడం ద్వారా కస్టమర్లకు మరింత ఉత్తమమైన వస్త్ర ఎంపికలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ నిర్వాహకులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

# చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు కివీస్..

## సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై 50 పరుగుల తేడాతో న్యూజిలాండ్ గెలుపు

**బలగం టీవి, హైదరాబాద్**




చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లోకి న్యూజిలాండ్ దూసుకెళ్లింది. సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై 50 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం సాధించింది. కివీస్ నిర్దేశించిన 363 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 312 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో కేవలం డేవిడ్ మిల్లర్ మాత్రమే సెంచరీతో ఆకట్టుకున్నాడు.

లాహెూర్ స్టేడియంలో జరిగిన రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 362 పరుగుల భారీ స్కోర్ చేసింది. రచిన్ రవీంద్ర(101 బంతుల్లో 13 ఫోర్లు, సిక్స్‌తో 108), కేన్ విలియమ్సన్(94 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 102) శతకాలతో రాణించారు. డారిల్ మిచెల్(37 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 49) , గ్లేన్ ఫిలిప్స్ (18 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 49 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. సౌతాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగిడి(3/72) మూడు వికెట్లు తీయగా.. కగిసో రబడా(2/70) రెండు వికెట్లు పడగొట్టాడు. వియాన్ మల్డర్(1/48)కు ఓ వికెట్ దక్కింది.

అనంతరం సౌతాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 312 పరుగులే చేసి ఓటమిపాలైంది. కెప్టెన్ టెంబా బవుమా(71 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 56), రాసీ వాన్ డెర్ డస్సెన్(66 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 69) హాఫ్ సెంచరీలతో రాణించారు. చివర్లో డేవిడ్ మిల్లర్(67 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 100 నాటౌట్) అజేయ శతకంతో ఒంటరి పోరాటం చేశాడు. భారీ లక్ష్యాన్ని ఛేధించే క్రమంలో సఫారీ బ్యాటర్లు ఒత్తిడికి చిత్తయ్యారు.డేవిడ్ మిల్లర్ సెంచరీతో చివరి వరకు ఒంటరి పోరాటం చేశాడు. కేవలం 67 బంతుల్లో పది ఫోర్లు, నాలుగు సిక్సర్ల సహాయంతో సెంచరీ నమోదు చేశాడు. డేవిడ్ మిల్లర్ రాణించడంతో దక్షిణాఫ్రికా కనీసం 300 స్కోర్ చేయగలిగింది. న్యూజిలాండ్ బౌలర్లలో మిచెల్ సాంట్నర్(3/43) మూడు వికెట్లు తీయగా.. గ్లేన్ ఫిలిప్స్(2/27), మ్యాట్ హెన్రీ(2/43) రెండేసి వికెట్లు పడగొట్టారు. మైకేల్ బ్రేస్‌వెల్(1/53), రచిన్ రవీంద్ర తలో వికెట్ తీసారు. న్యూజిలాండ్ బౌలర్లలో మిచెల్ సాంట్నర్‌కు మూడు, గ్లెన్ ఫిలిప్‌కు రెండు, మాట్ హెన్రికి రెండు, బ్రాస్‌వెల్, రచిన్ రవీంద్రాకు తలో వికెట్ దక్కింది. ఈ మ్యాచ్‌లో బ్యాట్‌తో పాటు బంతితో రాణించిన రచిన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

ఈ గెలుపుతో ఆదివారం దుబాయ్ వేదికగా జరిగే ఫైనల్లో టీమిండియాతో న్యూజిలాండ్ అమీతుమీ తేల్చుకోనుంది.




# ఓటీటీలోకి అఖిల్ 'ఏజెంట్'

**బలగం టీవి, హైదరాబాద్**

అక్కినేని అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో వచ్చిన భారీ యాక్షన్ చిత్రం ఏజెంట్. ఈ చిత్రం థియేటర్లలో దాదాపు రెండేండ్ల క్రితం విడుదలై ఫ్లాప్ అయ్యింది. అయితే తాజాగా 'ఏజెంట్' మూవీ మార్చి 14 నుంచి సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానున్నట్టు ప్రకటించారు. వక్కంతం వంశీ అందించిన కథకు దర్శకుడు సురేందర్ రెడ్డి సినిమాకు స్క్రీన్‌ప్లేను కూడా రచించారు. ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేందర్ 2 సినిమా బ్యానర్స్‌పై రామబ్రహ్మం సుంకర, అజయ్ సుంకర, పతి దీపా రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఏజెంట్ చిత్రంలో అఖిల్ అక్కినేనితో పాటు మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి, డినో మోరియా, సాక్షి వైద్య, డెంజిల్ స్మిత్, విక్రమ్‌జీత్ విర్క్ తదితరులు నటించారు.




# 'సంతాన ప్రాప్తిరస్తు' టీజర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

యువ నటుడు విక్రాంత్– తెలుగమ్మాయి చాందిని చౌదరి నటించిన తాజా చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. డైరెక్టర్ సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగ చేతులమీదుగా బుధవారం ఈ సినిమా టీజర్ రిలీజైంది. డైరెక్టర్ తరుణ్ భాస్కర్ కీలక పాత్ర పోషించగా, వెన్నెల కిషోర్, అభినవ్ గోమఠం, జీవన్ కుమార్, రమేశ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సునీల్ కశ్యప్ సంగీతం అందిస్తున్నారు. మధుర ఎంటర్టైన్మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్?పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

# రేపు రీరిలీజ్ కానున్న సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు



**బలగం టీవి, హైదరాబాద్**

సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాని మార్చి7 శుక్రవారం రీరిలీజ్ చేస్తున్నారు.ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

“సంక్రాంతి వస్తున్నాం తర్వాత ప్రేక్షకులని కలవడం ఆనందంగా వుంది. మార్చి7 శుక్రవారం సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు రీరిలీజ్ చేస్తున్నాం. తొలిప్రేమ డిస్ట్రిబ్యూషన్ చేసినప్పుడు ఐదేళ్ళు సినిమా రైట్స్ మా వద్ద ఉండేవి. మాకు ఎప్పుడు డబ్బులు తక్కువ వున్నా సినిమాని రీరిలీజ్ పెడితే ఆ సినిమా ద్వారా మనీ వచ్చేవి. అవన్నీ మిరాకిల్స్ డేస్. అలాగే ఇప్పుడు కూడా రీరిలీజ్ పెడితే ఆడియన్స్ చాలా ఇంట్రస్ట్ చూపిస్తున్నారు. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు మూవీ రీరిలీజ్ కి సంబధించి అప్పడే పది థియేటర్లు ఫుల్ అయిపోయాయి.సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు ఆల్రెడీ ఓటీటీ లో వుంది. జనం చుసేశారు. అయినప్పటికీ మళ్ళీ థియేటర్స్ కి వస్తున్నారంటే.. మంచి కంటెంట్ మళ్ళీ చూద్దామని వస్తున్నారు. మహేష్ గారి అభిమానులు, వెంకటేష్ గారి అభిమానులు థియేటర్ కి వచ్చి మళ్ళీ బ్రదర్స్ మధ్య వుండే మూమెంట్స్ ని మళ్ళీఎంజాయ్ చేద్దామని ఇన్ని థియేటర్స్ ఫుల్ చేశారంటే చాలా హ్యాపీగా వుంది. మంచి సినిమాలు తీస్తే థియేటర్స్ కి జనాలు వస్తారని రీరిలీజ్ లు ప్రూవ్ చేస్తున్నాయి. ఆంధ్రలో డే వన్ అరవై డెబ్బై శాతం అడ్వాన్స్ బుకింగ్స్ వున్నాయి. ఫ్రైడేకి అవి ఫుల్స్ అయిపోతాయి. సుదర్శన్ 35ఎంఎం సెకండ్ డే కూడా నాలుగు షోలు ఫుల్ అయ్యాయి. రీరిలీజ్ హ్యాపీనెస్ ఈ సినిమా ద్వారా కనిపిస్తోంది. నేనూ వెళ్లి మార్చి 7న సుదర్శన్ 35ఎంఎం లో మార్నింగ్ ఎనిమిది గంటల షో చూస్తాను. మళ్ళీ 12 ఏళ్ల తర్వాత ఈ సినిమాని థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయాలని అనిపిస్తోంది. 12 ఏళ్ల తర్వాత మళ్ళీ ఇద్దరు బ్రదర్స్ వస్తున్నారు కాబట్టి అందరూ థియేటర్స్ లో ఎంజాయ్ చేయండి.. థాంక్ యూ'అన్నారు.